క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిషత్ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్

బోట్‌క్లబ్: విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలకు స్థానిక ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ పట్నాయక్ కార్యకర్తలు నిర్మాణం, వ్యక్తిగత శీల నిర్మాణం, వార్షిక యోజన కార్యక్రమాలు, సంస్థాగత నిర్మాణ కార్యకలాపాలు, ప్రఖండ స్థాయి వర్గ నిర్వహణ విషయాలను వివరించారు. అనంతరం శిక్షణ ఇచ్చిన వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ఉత్తరాంధ్ర కార్యదర్శి భూపతి రాజు సుబ్బరాజు, జిల్లా కార్యదర్శి బిక్కిన రాజు పాల్గొన్నారు.

వైద్య ప్రమాణాలను మెరుగుపరచండి

ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌ని కలిసిన ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్



శ్రీహరిరావును మర్యాదపూర్వకంగా కలిసిన విష్ణువర్ధన్, చిత్రంలో ఐఎంఏ బృందం

కాకినాడ క్రైం: వైద్య ప్రమాణాలను మెరుగుపరిచి, వైద్య విద్యార్థులకు వాటిపై అవగాహన పెంపొందించాలని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావును కోరారు. వైద్యుల నమోదు ప్రక్రియ పరిశీలనకు కాకినాడకు వచ్చిన డాక్టర్ శ్రీహరిరావును డాక్టర్ విష్ణువర్ధన్ ఆదివారం కాకినాడలోని రామ్‌కోస భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

సంపూర్ణ గీతాపారాయణ



గీతాపారాయణలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సంపూర్ణ గీతాపారాయణ నిర్వహించారు. ఆలయ సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, శ్రీకృష్ణ పరివార సమితి సభ్యులు ఈ గీతా పారాయణలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ సిటీ: హైవే లైన్ షిఫ్టింగ్ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నమ్మ ఘాటీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఆదివారం తెలిపారు. 33/11 కేవీ అన్నమ్మఘాటీ విద్యుత్ ఉపకేంద్రంలో 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో కొవ్వూరు రోడ్, కొవ్వూరు, డీ-మార్ట్, శుభం కౌంటీ, గ్యాస్ గొడౌన్ రోడ్, అరట్లకట్ట పంప్ హౌస్ ఏరియాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

30న కాకినాడలో పూరీ జగన్నాథుడి రథయాత్ర

బోట్‌క్లబ్: ఇస్కాన్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన కాకినాడ నగరంలో అంగరంగ వైభవంగా పూరీ జగన్నాథుడి రథయాత్ర నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్‌శాఖ బాధ్యులు అనంత శేష దాస్ తెలియజేశారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు మధురానగర్‌లోని గోకులం ప్రాంగణం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర మెహర్‌నగర్, భానుగుడి సెంటర్, మెయిన్‌రోడ్డు, గోల్డ్ మార్కెట్ సెంటర్, సినిమా రోడ్డు మీదుగా సూర్యకళామందిరానికి చేరుకుంటుందన్నారు. సూర్యకళామందిరంలో రాత్రి జరిగే కార్యక్రమంలో పూరి జగన్నాథుడి వైభవంపై రాజమహేంద్రవరం ఇస్కాన్ బాధ్యులు సత్యగోపీనాథ్ ప్రవచనం ఉంటుందన్నారు.

జులై 17 నుంచి సాంఘిక నాటక పోటీలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జులై 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ కాకినాడ సూర్యకళామందిరంలో సాంఘిక నాటికల పోటీలు నిర్వహించనున్నట్టు పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానంద బాబు ఆదివారం విలేకరులకు తెలిపారు. జులై 17 సాయంత్రం 7 గంటలకు విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారి 27వ మైలు రాయి, అనంతరం కొలకలూరి వారి జనరల్ బోగీలు 18న తాడేపల్లి వారి విడాకులు కావాలి, విశాఖపట్నం వారి దేవరాగం, చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం, 19న హైదరాబాద్ వారి అమ్మచెక్కిన బొమ్మ, విశాఖపట్నం వారి దొందూ- దొందే, 20న విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారి స్వేచ్ఛ నాటిక ప్రదర్శించనున్నారని తెలిపారు. కళాభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరారు.

పీహెచ్‌సీ క్వార్టర్లు శిథిలం

- స్థానికంగా ఉండని వైద్యులు
- అందని అత్యవసర వైద్యసేవలు
- రాత్రి సమయంలో మరింత ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు



కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



కరప ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శిథిలమైన వైద్య సిబ్బంది క్వార్టర్లు



క్వార్టర్ల వద్ద పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, తుప్పలు

కరప: రాత్రి సమయంలో అత్యవసర వైద్య సేవలందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏ సమస్య వచ్చినా కాకినాడ వెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రమైన కరప ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో పీహెచ్‌సీ సిబ్బంది స్థానికంగా నివాసం ఉండకపోవడంతో ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా పట్టించుకోని అధికారుల పనితీరుకు ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఒకప్పుడు ఎంతో ఆదర్శంగా ఉండే కరప పీహెచ్‌సీ వైద్యసేవలు ఇప్పుడు అంతంతమాత్రంగా ఉంటున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు, అనుభవం ఉన్న సిబ్బంది ఉన్నా వారు స్థానికంగా నివాసం ఉండడానికి క్వార్టర్లు లేక జిల్లా కేంద్రం కాకినాడ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. క్వార్టర్స్ ఉంటే ఇక్కడే నివాసం ఉండేవాళ్లమని సిబ్బంది చెబుతున్నారు.

రోజుకు 160 ఓపీ

కరప ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇద్దరు వైద్యులు, ఇతర వైద్యసిబ్బంది ఉంటారు. వైద్యులు, సిబ్బంది ఉండడానికి పీహెచ్‌సీ ఆవరణలోనే క్వార్టర్లు ఉండేవి. క్వార్టర్లన్నీ కూడా శిథిలమవడంతో స్థానికంగా ఎవరూ నివాసం ఉండడంలేదు. దీంతో రాత్రి సమయంలో వైద్యసేవలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పీహెచ్‌సీకి మండల గ్రామాలతో పాటు పెదపూడి మండలంలోని శహపురం, కాండ్రేగుల తదితర గ్రామాల నుంచి ప్రతిరోజు సరాసరి 160 మంది వరకు వైద్య సేవల కోసం వస్తుంటారు. పగలు వైద్యసేవలు సక్రమంగానే అందుతున్నా రాత్రి సమయంలో ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. రాత్రిళ్లు పాము కరచినా, పురిటి నొప్పుల వచ్చినా తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని, అత్యవసర వైద్యసేవలకు కాకినాడ వెళ్లాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు.

క్వార్టర్లను పునర్నిర్మించాలి

కరపలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పని చేసే వైద్యులు, సిబ్బంది నివాసం ఉండేందుకు క్వార్టర్లు ఉండేవి. అందరూ స్థానికంగా అందుబాటులో ఉన్నప్పుడు ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందేవి. ఏ సమయంలో గర్భిణులు వచ్చినా, కుక్క, పాము కాటు బాధితులు వచ్చినా వైద్యసేవలు సకాలంలో అందించేవారు. పీహెచ్‌సీలోని క్వార్టర్లు శిథిలమైనా ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో పీహెచ్‌సీ సిబ్బంది స్థానికంగా లేకపోవడంతో సాయంత్రం 6 గంటల తర్వాత అత్యవసరంగా వచ్చేవారికి వైద్యం అందడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీహెచ్‌సీకి కొత్త భవనం నిర్మించారే కానీ, క్వార్టర్ల గురించి పట్టించుకోలేదని స్థానిక అంటున్నారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా..

2023లో అప్పటి కాకినాడరూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కరప పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయించి, వైద్యులు, సిబ్బంది నివాసం ఉండి, వైద్యసేవలందించేలా క్వార్టర్లను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2024లో ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటినుంచి కరప పీహెచ్‌సీ గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న పిచ్చిమొక్కలు, తుప్పలతో క్వార్టర్లు ఉన్నట్టు కూడా కనబడటంలేదు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి కరప పీహెచ్‌సీ క్వార్టర్లను పునర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **అందని వైద్యసేవలు**
>
> 
>
> కరప పీహెచ్‌సీ క్వార్టర్స్ శిథిలమైనా ఎవరూ పట్టించుకోవడంలేదు. వైద్య సిబ్బంది స్థానికంగా లేకపోవడంతో రాత్రి సమయంలో అత్యవసర వైద్యసేవలు అందడంలేదు. రాత్రి సమయంలో విషసర్పాలు కట్టినా, గర్భిణులకు పురిటినొప్పులు వచ్చినా కాకినాడ వెళ్లాల్సి వస్తోంది. దీని వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పాలకులు స్పందించి క్వార్టర్ల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.
>
> – పెంకే సత్తిబాబు, కరప

సూర్యారావుకు నివాళి



యాసలపు సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ప్రజాకవి ఉత్తమ కమ్యూనిస్ట్ యాసలపు సూర్యారావు వర్ధంతిని ఆదివారం స్థానిక సుందరయ్యభవన్‌లో నిర్వహించారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషుబాబ్జీ, కె.సత్తిరాజు, సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ప్రాథమిక విద్య మాత్రమే అభ్యసించిన సూర్యారావు పండితులకు ఏ మాత్రం తీసిపోకుండా కవితలు, రచనలు చేశారన్నారు. సైకిల్ షాపు మెకానిక్ అయినా ఎర్రజెండా చేతపట్టి అభ్యుదయ మార్గంలో పయనించి ఎర్రజెండాకె వన్నె తెచ్చేలా ఆయన కార్యాచరణ సాగిందన్నారు. యువజన, కార్మిక, రైతు, కళా రంగాల్లో పని చేసిన సూర్యారావు సీపీఎం పెద్దాపురం పట్టణ కార్యదర్శిగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యుడిగా పని చేశారన్నారు. రెండు సార్లు పెద్దాపురం మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రజావాణి వినించారన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణలతో పాటు సీహెచ్ సతీష్, అనపర్తి ఏడుకొండలు, మేడిశెట్టి వెంకటరమణ, పి.జయరాం తదితరులు పాల్గొన్నారు.

జీర్ణ వ్యవస్థలో కాలేయం కీలకం

జీర్ణాశయ పేగుల వైద్య నిపుణుడు డాక్టర్ ఆదిత్య సత్య ప్రసన్న



బోట్‌క్లబ్ ఉద్యానవనంలో కాలేయం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న డాక్టరు ఆదిత్య ప్రసన్న కుమార్

కాకినాడ రూరల్: జీర్ణ వ్యవస్థలో కాలేయం కీలమని, ఆహారాన్ని జీర్ణం చేయడంతో పాటు శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగించి శరీర సమతుల్యతను కాపాడుతుందని ప్రముఖ జీర్ణాశయ పేగుల వైద్య నిపుణుడు డాక్టరు ఎ.ఆదిత్య సత్యప్రసన్న పేర్కొన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అహోబిలం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో వాకర్స్‌కు ఆదివారం ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న వారందరికీ రక్త, బీపీ పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు ఆదిత్య సత్యప్రసన్న మాట్లాడుతూ పుట్టిన రోజు నుంచి చనిపోయే వరకు నిరంతరం పెరుగుతూ ఉండే ఏకైక అవయవం కాలేయన్నారు. మద్యం, అతి కొవ్వు పదార్థాల వినియోగం, కలుషిత ఆహారం, పరిశుభ్రమైన నీరు తాగకపోవడం వలన కాలేయానికి రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు రోజు వ్యాయామం చేయాలని, బరువు పెరగరాదన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏయే ఆహార పదార్థాలలో ఎన్ని క్యాలరీలు లభిస్తాయో డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఒక వేళ కాలేయం చెడిపోతే బ్రెయిన్ డెత్ అయిన వారి నుంచి సేకరించి మార్పు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టరు దాసరి శ్రీధర్, చిరంజీవి రావు, యనమల రామం, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, శ్రీరామరాజు, శ్రీవాణి, కుమార్ యాదవ్, ప్రసాద్ నాయుడు, సూర్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే చోట కలసిన విశ్రాంత ఉద్యోగులు

- ఏర్పాట్లు చేసిన తహసీల్దార్
- సీనియర్ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులకు సత్కారం
- ఘనంగా రెవెన్యూ దినోత్సవం



సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సత్కరించిన తహసీల్దార్, స్థానిక రెవెన్యూ సిబ్బంది

సామర్లకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ శాఖలో పని చేయడం కత్తి మీద సాము లాంటిదని, అటువంటి శాఖలో పని చేసి పదవి విరమణ చేసిన వారిని ఒక చోటకు చేర్చి వారిని సత్కరించడం అభినందనీయమని పలువురు విశ్రాంత ఉద్యోగులు పేర్కొన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 90 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన సీనియర్ విశ్రాంత ఉద్యోగులను గుర్తించి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. డిప్యూటీ కలెక్టరు, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ స్థాయిలో పదవి విరమణ పొందిన ఉద్యోగులు మాట్లాడుతూ తమ చరిత్రలో ఇటువంటి కార్యక్రమం ఎన్నడూ చూడలేదన్నారు. ఎక్కడ ఎక్కడో ఉన్న వారిని ఒక చోట చేరేలా చేయడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమం కంటే గతంలో పని చేసిన ఉద్యోగులను కలుసుకున్నా ఆనందం ఎన్నటికి మరచి పోలేమన్నారు. ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేయాలనే ఆలోచన రావడంపై తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డిని పలువురు అభినందించారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ తాను ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఆయా ప్రాంతాల్లో పని చేసిన ఉద్యోగులతో పాటు సామర్లకోట తహసీల్దార్ కార్యాలయంలో పని చేసి పదవీ విరమణ చేసిన వారిని గుర్తించి రెవెన్యూ దినోత్సవం సందర్భంగా సత్కరించాలని నిర్ణయించామన్నారు. ఆహ్వానించిన వెంటనే వయస్సు భారం అయినా రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ విశ్రాంత అధికారులు తమ తమ అనుభవాలను వివరించారు. సీనియార్టీ ప్రకారం విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు శ్రీనివాసు, పద్మాజారెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విత్తులోనే ఉంది సత్తువ!

- విత్తన శుద్ధికి సిద్ధమవుతున్న బీజామృతం
- దుర్గాడలో భారీగా తయారీ
- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు
- విత్తన శుద్ధిలో జాగ్రత్తలు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది



విత్తన శుద్ధి చేస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది



దుర్గాడలో బీజామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

పిఠాపురం: విత్తనం ఒకటి వేస్తే మొక్క ఒకటి వస్తుందా అంటారు పెద్దలు. వేసే విత్తనాన్ని బట్టే వచ్చే పంట ఉంటుంది. పంటల సాగులో కీలక దశ విత్తనం నాటడం. ఈ విత్తనం ఎంపికపైనే పంటల దిగుబడి ఆధారపడి ఉంటుంది. మంచి విత్తనం నాటితే సగం ఖర్చు తగ్గించుకున్నట్లే. అలాగే తీసుకున్న విత్తనం నాటే ముందు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మరింత మేలు జరుగుతుంది. విత్తనం నాటే దశలోనే జాగ్రత్తలు పాటించడం ద్వారా మొక్కలు తెగుళ్ల నుంచి తట్టుకునే శక్తి పెరుగుతుంది. అందుకే విత్తు నాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, విత్తన శుద్ధి చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి ఎలియాజరు రైతులకు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ నారుమళ్లు వేస్తుండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు. విత్తనాలను ఏవిధంగా శుద్ధి చేసుకోవాలో వివరిస్తున్నారు.

బీజామృతం తయారీ విధానం

ప్రకృతి వ్యవసాయంలో అత్యంత కీలకంగా విత్తన శుద్ధిని చెబుతుంటారు. తద్వారా చాలా వరకు తెగుళ్ల నివారణతో పాటు అధిక దిగుబడి అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని కోసం ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం ఉపయోగిస్తుంటారు. ఇది తయారు చేయడానికి ముందుగా 15 లీటర్ల నీటిని తీసుకోవాలి. దానిలో 5 లీటర్ల నిల్వ ఉన్న గోమూత్రం సిద్ధం చేసుకోవాలి. వాటితో పాటు 5 కేజీల దేశీయ తాజా ఆవు పేడను తీసుకుని పుట్ట మన్ను, 50 గ్రాముల సున్నపు నీళ్లు సిద్ధం చేసుకోవాలి. వీటన్నింటిని ఒక బకెట్‌లో కలుపుకోవాలి. తయారైన బీజామృతం ద్రావణాన్ని గుడ్డతో వడకట్టుకోవడం మంచిది. వడకట్టడం వల్ల విత్తన శుద్ధి చేసుకోడానికి వీలుగా ఉంటుంది. ఈ విధంగా తయారు చేసిన ద్రావణం సుమారు 100 కేజీల వరి విత్తనాలను శుద్ధి చేయడానికి సరిపోతుంది.

విత్తన శుద్ధి వల్ల లాభాలు

కూరగాయలు, వరి తదితర ఏరకమైన విత్తనాలు అయినా సరే బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తే అనేక రకాల ఉపయోగాలు ఉంటాయి. సాధారణంగా రైతులు సొంతంగా తయారు చేసుకునే విత్తనాల్లో వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల మార్పుల వల్ల బ్యాక్టీరియాలు సీలింద్రాలు వ్యాపించి ఉంటాయి. తద్వారా రైతులు ఆ విత్తనాలను అలాగే వాడితే పంటలకు తెగుళ్లు తొందరగా వ్యాపించి పంటలను నాశనం చేస్తుంటాయి. గతంలో పండించిన పంటలకు వ్యాధులు వ్యాపించి ఉన్నట్టయితే అదే విత్తనాన్ని వాడినా పంటలు దెబ్బ తింటాయి. అలా కాకుండా ఏ విత్తనాన్ని అయినా విత్తన శుద్ధి చేసుకుంటే గతంలో ఉన్న ఏ విధమైన తెగుళ్లు ఉన్నా అవి విత్తన శుద్ధి ద్వారా నాశనం అయ్యి విత్తనం బలవర్ధకంగా ఉండి మంచి దిగుబడులు ఇచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. మామూలుగా రసాయనక మందులతో విత్తన శుద్ధి చేసినా కొంత వరకు మాత్రమే లాభాలు ఉంటాయి. అదే సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తే వంద శాతం విత్తనం నాణ్యమైందిగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల మొలక శాతం పెరగడంతో పంటలు బాగా పంటే అవకాశం ఉంటుంది. ఆరోగ్యకరమైన నారు, పంటలు, ఆహారం ఉత్పత్తి జరుగుతుంది. కొన్ని కోట్ల సహజ సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియాలు ఉండి విత్తనం ద్వారా భూమికి సత్తువను పెంచుతాయి చీడపీడలను దరి చేరనివ్వదు.

> **బీజామృతంతో విత్తన శుద్ధి**
>
> 
>
> బీజామృతంతో విత్తన శుద్ధి వల్ల పంట బాగుంది. నేను సాగు చేస్తున్న 4 ఎకరాల్లో వరి సాగులో గత మూడేళ్లుగా బీజామృతంతోనే విత్తన శుద్ధి చేస్తున్నాను. గతంలో రసాయనక మందులతో విత్తనశుద్ధి చేసినా తెగుళ్ల మామూలుగా వ్యాపించి ఎరువులకు పురుగు మందులకు చాలా పెట్టుబడి పెట్టాను. కాకి బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం ప్రారంభించాకా చాలా వరకు తెగుళ్ల తగ్గిపోయాయి. ఎరువులు అంతంతమాత్రంగానే వేసే అవసరం వచ్చింది. అది కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన ఎరువులనే వాడుతున్నాను. దీని వల్ల మా పంటలకు మంచి డిమాండ్ ఉంటోంది. లాభాలు బాగా వస్తున్నాయి.
>
> – గాబు బాబ్జి, ప్రకృతి వ్యవసాయ రైతు, కత్తిపూడి, శంఖవరం మండలం

> **అందుబాటులో ఉంచుతున్నాం**
>
> 
>
> ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు తగ్గట్టుగా రైతులకు సరఫరా చేసేందుకు పెద్ద మొత్తంలో బీజామృతం తయారు చేసి అందుబాటులో ఉంచడానికి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే పలువురు రైతులకు దీనిని సరఫరా చేశాం. దీనితో విత్తనశుద్ధి చేసే విధానాన్ని మా సిబ్బంది స్వయంగా వెళ్లి రైతులకు వివరిస్తున్నారు. గొల్లప్రోలు మండలం గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ, శిక్షణా కేంద్రంలో గుండ్ర శివచక్రం ఆధ్వర్యంలో బీజామృతం తయారీ చేపట్టాం. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు దీనిని ఉపయోగించడానికి ముందుకు వస్తున్నారు. రసాయనక మందులతో విత్తన శుద్ధి చేయడానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుంది. అదే బీజామృతంతో విత్తన శుద్ధి చేయడానికి పెద్దగా ఖర్చు అవ్వదు. గత ఏడాది సుమారు 5వేల లీటర్ల బీజామృతం రైతులకు పంపిణీ చేశాం. ఈ ఏడాది సుమారు 10 వేల లీటర్ల బీజామృతం తయారు చేసేందుకు ఏర్పాట్లు చేశాం. రైతులకు లీటరు కేవలం రూ.10లకే పంపిణీ చేస్తున్నాం. ఎక్కువ మందికి ఉచితంగా కూడా ఇస్తున్నాం. కేవలం ఆరోగ్యకరమైన పంటలు పండించడానికి రైతులు పంటలను నష్ట పోకుండా మంచి లాభాలు ఆర్జించడానికి మా ప్రయత్నం మేము చేస్తున్నాం. రైతులు సహకరిస్తున్నారు.
>
> – ఎలియాజరు, ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం, కాకినాడ

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



అగ్నిప్రమాద బాధితులను పరామర్శించి అధికారులతో మాట్లాడుతున్న వంగా గీత

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: ప్రమాదవశాత్తు ఇల్లు అగ్నికి ఆహుతయ్యి నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత కోరారు. పిఠాపురం మండలం నవఖండ్రవాడలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో సిద్ధాంతపు బాబులు, సిద్ధాంతపు భగవాన్‌దాస్‌లకు చెందిన పూరిల్లు దగ్ధమయ్యి కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న ఆమె సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద బారిన పడిన కుటుంబాన్ని ఆదుకోడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి భరోసా కల్పించిన ఆమె పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నేతలు పలువురు ఉన్నారు.

కోరింగ అభయారణ్యంలో ఎఫ్‌ఆర్‌ఓ ట్రైనీలు



కోరింగ అభయారణ్యంలో బోటు షికారు చేస్తున్న ట్రైనీ ఎఫ్‌ఆర్‌ఓలు

తాళ్లరేవు: కోరింగ అభయారణ్యాన్ని ఆదివారం మహారాష్ట్ర చంద్రపూర్ ఫారెస్ట్ అకాడమీకి చెందిన ఎఫ్‌ఆర్‌ఓ ట్రైనీలు సందర్శించారు. 52 మంది అభయారణ్యంలోని ప్రదేశాలను ఆసక్తిగా తిలకించారు. మడ చెట్ల అందాలను తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేసారు. అనంతరం ఉత్సాహంగా బోటు షికారు చేసారు. అభయారణ్యంలోని చిత్తడి నేలలు, వన్యప్రాణుల వివరాలు, మడ అడవుల విశిష్టత, పక్షుల తదితర వివరాలను ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ వారికి వివరించారు. సీబీఈటీ, ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కె.సిద్ధార్థ, వీరభద్రరావు, ఎఫ్‌బీఓ జి.గోపి నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, కె.ధనుంజయరావు, సీబీఈటీ, ఆలివ్ రిడ్లే టర్టిల్స్ కన్జర్వేషన్ తదితర అంశాలపై అధ్యయనం చేసారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎఫ్‌బీఓలు కె.మహేష్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, సీబీఈటీ సిబ్బంది ఉన్నారు.

నేత్ర వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు



మాధవరాయునిపేటలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు మాధవరాయునిపేటలో దివంగత పిల్లి ధనరాజు, సత్యవతి, వెంకట్రావు, పిల్లి ధరణి సత్య జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు అనూష వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 50 మందికి సోమవారం శ్రీ కిరణ్ కంటి ఆస్పత్రికి తరలించి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆస్పత్రి కోఆర్డినేటర్ శివగణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, నాయకులు వుంగరాల వెంకటేశ్వరరావు, మేడిశెట్టి సత్తిబాబు, ధూళిపూడి వెంకటరమణ, గంజా సూరిబాబు, రోళ్ల చక్రవర్తి పిల్లివారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.